## జెఇఇ మెయిన్స్‌లో మదనపల్లె విద్యార్థికి ఉత్తమ ర్యాంకు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :** జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో మదనపల్లె విద్యార్థి సత్తాచాటాడు. నీరుగట్టువారిపల్లిలోని బ్రిలియంట్ హైస్కూల్ పూర్వపు విద్యార్థి మొదంపల్లె వేదహర్షిత్‌రెడ్డి బుధవారం వెలువడిన ఫలితాలలో 99.59 శాతంతో ఆలిండియా ర్యాంకు సాధించి మెరిశాడు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు మొదంపల్లె సహదేవరెడ్డి, రజినీలు మాట్లాడుతూ 10వ తరగతి వరకు బ్రిలియంట్ హైస్కూల్ లో చదవి ఉత్తమ మార్కులు సాధించడంతో, అదే పట్టుదలతో చదవి జెఇఇ మెయిన్స్‌లో 99.59 శాతం అత్యుత్తమ పర్సంటైల్‌తో ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందన్నారు. బ్రిలియంట్ హైస్కూల్‌లో నాణ్యమైన విద్యతోపాటు పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం తోనే వేదహర్షిత్ ఈ విజయం సాధించాడన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. జెఇఇ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వేదహర్షిత్ రెడ్డిని బ్రిలియంట్ హైస్కూల్ యాజమాన్యం,పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

# ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ యాక్షన్

- ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరిక
- పీలేరు పట్టణంతోపాటు మండలంలోనూ ఆక్రమణలపై చర్యలు

**ప్రజాశక్తి-పీలేరు**

ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను తొలగించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం పీలేరులోని నాగిరెడ్డి కాలనీ లో సర్వే నంబర్ 72/2లోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా కడుతున్న నిర్మాణాలను కలెక్టర్ శ్రీధర్ చామకూరి తనిఖీ చేసి అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. నిర్మాణాలను తొలగించే భూమిలో తాము ఎన్నో ఏళ్లుగా తమ అనుభవంలో ఉండటంటూ బాధిత వ్యక్తులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, బిపిఎల్‌కు ఎగువన ఉన్న వారు ప్రభుత్వం జారీ చేసిన నియమ నిబంధనలకు లోబడి సరైన ఆధారాలతో దరఖాస్తు చేసు కుంటే వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జెసిబితో అక్రమ కట్టడాలను తొలగించడాన్ని స్వయంగా పర్యవేక్షించా రు. అనంతరం పీలేరు-తిరుపతి రహదారి పక్కన ఎర్రగుంటపల్లె పంచా యతీ పరిధిలోని సర్వే నంబర్లు 741, 785, 774/2లో ఆక్రమంగా నిర్మించిన నాలుగు అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదేశించి, జెసిబి తో తొలగించడాన్ని స్వయంగా పర్యవేక్షించారు. అక్కడనుండి పీలేరులో ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించిన మరో ప్రాంతాన్ని కూడా సందర్శించి తహశీల్దారు, డిప్యూటీ తహశీ ల్దారుకు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పీలేరు మండలం, తలుపుల గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 1960, 2360/2,2361/10,11 ఉలవల గంగమ్మ గుట్టపై ప్రభుత్వ, గయాలు, అటవీ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూడా తొలగించాలని ఆర్‌డిఒ, తహశీల్దారులను ఆదేశించి, జెసిబితో అక్రమ నిర్మాణాన్ని తొలగించడాన్ని కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. అక్కడ ఆక్రమించిన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు బోర్లు, స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకోవాలని పీలేరు తహశీల్దారును ఆదేశించారు. పీలేరులోని కోటపల్లె ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూడా తొలగించాలని ఆర్డీఒ, తహశీల్దారులను ఆదేశించి తొలగింపు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దారు రెడ్డప్ప రెడ్డి, సిఐ యుగంధర్, సర్వే శాఖ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

పీలేరులో అక్రమ నిర్మాణాల తొలగింపు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

# అంగన్వాడీల నోటిఫికేషన్ రద్దు చేయండి

**- సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు**

**ప్రజాశక్తి-రాయచోటి టౌన్**

2024 డిసెంబర్ 24న విడుదల చేసిన అంగన్వాడీల అక్రమ నోటిఫికేషన్‌లో అనేక అవకతవకలు ఉన్నాయని వెంటనే నేడు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను కలెక్టర్ రద్దు చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టర్ ఆఫీస్ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సిడిపిఒలు అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్‌లు ఇవ్వకుండా డబ్బులకు తాయిలాలకు తలొగ్గి ఇష్టానుసారంగా అనర్హులకు అవకాశం ఇచ్చారని విమర్శించారు. వీటి మీద కనీస విచారణ చేయకుండా వత్తాసు పలికిన పీడీ రమాదేవి వాటా ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. మదనపల్లి ప్రాజెక్టు వేంపల్లి హెల్పర్‌కు మొండిచేయి చూపారని, అప్పారావుతోట సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్న వర్కర్‌కి న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల సెంటర్ ఖాళీగా ఉన్నా నోటిఫికేషన్‌లో చూపించలేదని తెలిపారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ప్రమోషన్ జిఒలను చెత్త బుట్టలో వేస్తున్న ఐసిడిఎస్ అధికారుల మీద సమగ్ర విచారణ చేపట్టి అక్రమ నోటిఫికేషన్ రద్దు చేసేలా కలెక్టర్ జోక్యం చేసుకొని అర్హు లకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. కార్యక్ర మంలో సిపిఎం జిల్లా నాయకులు రామాంజులు, శివ, నాగార్జున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

# రుణ లక్ష్యాలు పూర్తికి చర్యలు : ఎల్‌డిఎం

సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డిఎం ఆంజనేయులు

**ప్రజాశక్తి-పీలేరు**

2024-25 ఆర్థిక సంవత్సరం రుణాల పంపిణీ లక్ష్యాలను మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ జి.ఆంజనేయులు తెలిపారు. పిలేరు బ్లాక్ పరిధిలోని పీలేరు, గుర్రంకొండ, కలకడ, కలికిరి, కంభం వారిపల్లి మండలాల జాయింట్ మైక్రో లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎల్‌డిఎం ఆంజనేయులు అధ్యక్షత వహించి మాట్లాడుతూ క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డ్స్ రుణాల ప్రగతి, ప్రధాన మంత్రి విశ్వకర్మ లోనింగ్ పథకం, ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకాల అమలు, నిష్క్రియ ఖాతాల యాక్టివేషన్ ప్రచారం, సైబర్ మోసాలపై అవగాహన, పశుసంవర్ధక రుణాలు ప్రగతి, పిఎంఇజిపి పథకం అమలు, ఐడబ్ల్యూఎస్ ఒబిసి కార్పొరేషన్ లక్ష్యాల సాధన, క్లెయిమ్ చేయని డిపాజిట్ల ప్రచారం వంటి అంశాలపై చర్చించారు. ఎస్‌ఎల్‌బిసి గత త్రైమాసిక జెఎంఎల్‌బిసి సమావేశానికి బ్యాంకు మేనేజర్ల హాజరు తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు భవిష్యత్తులో బ్యాంకు మేనేజర్లు తప్పనిసరిగా సమావేశాలకు హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో నాబార్డ్ డిడిఎం విజయ విహారి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వైవి.రమణ రావు, ఐపిఒ శంకర్, ఐదు మండలాలకు చెందిన బ్యాంకు మేనేజర్లు, వెలుగు విఒఎలు, ఎపిఎంలు, ఇతర బ్యాంకింగ్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# పకడ్బందీగా 'పది' పరీక్షలు : డిఆర్‌ఒ

మాట్లాడుతున్న డిఆర్‌ఒ మధుసూదన్‌రావు

**ప్రజాశక్తి-రాయచోటి**

జిల్లాలో పదవ తరగతి పరీక్షలను నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధు సూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో డిఆర్‌ఒ అధ్యక్షతన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. జిల్లాలోని 121 పరీక్ష కేంద్రాలలో 22,355 మంది విద్యార్థులు ఈ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. రెగ్యులర్ విద్యార్థులు 22,050 మంది, ఒక్కసారి ఫెయిలైన విద్యార్థులు 305 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 834 మందికి కూడా 19 కేంద్రాలలో పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, టాయిలెట్స్, తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు వెంటిలేషన్ అన్నీ సక్రమంగా ఉండేలా ముందస్తుగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖ, మెడికల్, విద్యుత్, పోస్టల్ శాఖలు వారికి సంబంధించిన విధులను బాధ్యతగా నిర్వర్తించి పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ నెల 15 లోగా రూట్ ఆఫీసర్లను, జాయింట్ కస్టోడియన్లను నియమించాలని 26వ తేదీలోగా ఇన్విజిలేటర్ల నియామకాలు పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఎటువంటి సంద ర్భంలో మొబైల్ ఫోన్స్ తీసుకొని రాకూడదని పేర్కొన్నారు. విద్యార్థులు ఎటు వంటి స్లిప్పులు గాని, ఏ ఇతర వస్తువులు గాని తీసుకొని రాకూడదని, కాపీయింగ్ పూర్తిగా అరికట్టాలన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. టాస్క్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ వారి విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తి చాలన్నారు. పరీక్షల రోజులలో అవసరమైన చోట విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి వారిని, విద్యుత్ అం తరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను, పరీ క్షల చీఫ్ సూపర్ ఇంటెండెంట్లు అందజేసే సీల్డ్ పరీక్ష జవాబు పత్రాలను స్వీక రించాలని పోస్ట్ మాస్టర్లను, పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవ సరమైన మందులు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యశాఖ అధి కారులను ఆదేశించారు. సమావేశంలో డిఇఒ సుబ్రమణ్యం, డిప్యూటి డిఇఒ శివ ప్రకాశ్‌రెడ్డి, విద్యుత్తు శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డిపిఆర్‌ఒ పురుషోత్తం, వైద్య, ఖజానా, పోలీస్, రెవెన్యూ, ఆర్‌టిసి, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**నవోదయ విద్యాలయాల నిర్వహణ పటిష్టంగా ఉండాలి**

గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తూ జవహర్ నవోదయ విద్యాలయాలను పటిష్టంగా నిర్వహించాలని డిఆర్‌ఒ మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ విసిహాలులో జవహర్ నవోదయ విద్యాలయాలకు సంబంధించి మేనేజ్మెంట్, అడ్వైజరీ కమిటీ, జిల్లా స్థాయి ఆహార కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు, పనితీరు, నిర్వహిస్తున్న తరగతులు, ఎంపిక విధానం, విద్యార్థుల సంఖ్య, అకడమిక్ కార్యక్రమాలు, లైబ్రరీ, ల్యాబులు, విజ్ఞాన్ జ్యోతి ప్రోగ్రాం, పీఎం శ్రీ ప్రోగ్రాం తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నారమరాజు పల్లి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ గీత సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జవహర్ నవోదయ విద్యా లయంలో 279 మంది బాలురు, 150 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. విద్యాలయంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అంతర్గత బీటీ రోడ్లు, పది సోలార్ వీధిలైట్లు, బాలురు, బాలికలకు ఎన్‌సిసి యూనిట్, కంప్యూ టర్ లాబ్ అవసరమని తెలిపారు. డిఆర్‌ఒ మాట్లాడుతూ జవహర్ నవోదయ విద్యాలయాలలో అంతర్గత బిటి రోడ్ల నిమిత్తం తగిన ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బి శాఖను, సోలార్ వీధిలైట్లు, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాలయ అధికారులకు సూచించారు.

ఐసిడిఎస్ పీడీకి వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

## 17న అంగన్వాడీల మహాధర్నా

**ప్రజాశక్తి-రాయచోటి టౌన్ :** ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్నమయ్య జిల్లా లో ఈ నెల 17న అంగన్వాడీల సమస్యల మీద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యస్. శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి కోశాధికారి పి.బంగారుపాప పేర్కొన్నారు. గురువారం ఐసిడిఎస్ పీడీ రమాదేవిని కలిసి ధర్నా నోటీసును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అంగన్వాడీ ల 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా వైసిపి ప్రభుత్వం యూనియన్ ప్రతినిధులతో చర్చలు చేసి డిమాండ్స్ ను అంగీకరించి గ్రూప్ ఆఫ్ మినిట్స్ కాపీలో పొంది పరిచినవి అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వేతనాల పెంపుదల, గ్రాట్యూటీ అమలు, మెటర్నటి లీవులు, ప్రమోషన్‌లు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా మార్చడం, సూపర్వైజర్ పోస్టుల భర్తీ చేయాలని, ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని తదితర డిమాండ్ల సాధన కై జరుగుతున్న మహా ధర్నాను జిల్లా లోని అంగన్వాడీలు పెద్ద ఎత్తున ప్రాజెక్టుల వారిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## కుల ధ్రువీకరణ మంజూరులో జాప్యం

**ప్రజాశక్తి మదనపల్లె అర్బన్ :** కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఆలస్యం అవుతుం డడంతో బిసి రుణాల దరఖాస్తుకు ఆటంకం కలుగుతోంది. బిసి మహిళలు స్వయం ఉపాధి రంగాలలో రాణిం చేందుకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. పట్టణంలో సుమారు 1000 మందికి పైగా బిసి మహిళలు రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఉపక్రమించారు. వీరికి తహ శీల్దార్ మంజూరు చేసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. ఈనెల 10వ తేదీనే దరఖాస్తుల ఆహ్వానానికి గడువు ముగిసినా సర్టిఫికెట్ల ఆల స్యంతో ప్రభుత్వం మరో ఐదు రోజులు పొడిగించి 15వ తేదీ వరకు గడువును పెంచింది. అయినప్పటికీ లబ్ధి దారులకు సకాలంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. వారం తరబడి తహశీల్దారు కార్యాల యం చుట్టూ తిరుగుతున్నా అధికారులు కరుణించడం లేదని బాధితులు వాపో యారు. గురువారం తహశీల్దార్ కార్యాలయానికి బాధితులు చేరుకుని అధికా రులపై అసహనాన్ని వ్యక్తం చేశారు. తమకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందకపోతే రుణాల దరఖాస్తుకు అర్హత కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ గురు తమను ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారని, ఎవరు చెప్పినా చేసేది లేదని కసురుకుం టున్నారని అన్నారు. ఈ విషయమై తహశీల్దార్ ధనంజయులును వివరణ కోరగా ఇప్పటికే వెయ్యికి పైగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు తమ వద్దకు వచ్చాయని, రాత్రింబవళ్లు పనిచేస్తున్న అయిపోవడం లేదన్నారు. ఒకటి, రెండు రోజుల్లో కచ్చితంగా వాటిని మంజూరు చేస్తామన్నారు. ఎవరిని నిర్లక్ష్యంగా మాట్లాడే పరిస్థితి ఉండదని, పని ఒత్తిడి వల్ల కాస్త ఆలస్యం అవుతోందే తప్ప ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. 15వ తేదీ వరకు గడువు ఉన్నందున ప్రతి ఒక్కరికి శుక్రవారంలోపే ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తామని తెలిపారు.

కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాల కోసం వేచి ఉన్న మహిళలు

## 'అన్నమాచార్య' విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

అన్నమాచార్య ఇఇఇ విభాగం విద్యార్థులు డి.నవీన్‌కుమార్‌రెడ్డి, ఆర్.మణి ధనుష్ వర్మ, పి.శివమహేశ్వర్ రెడ్డి, పి.నజీర్ హుస్సేన్, పర్యవేక్షకుడు ఎం.సాయిసందీప్ ఆధ్వర్యంలో సౌర విద్యుత్‌తో నడిచే ద్విచక్ర వాహనాన్ని వినూత్నంగా ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టును అన్నమాచార్య విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ చొప్ప గంగిరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితమైన ఈ ద్విచక్ర వాహనం గంటకు 45 కిలోమీటర్లు వేగంతో 30 కిలోమీటర్ల మైలేజ్‌ను అందించగలుగుతుందని అన్నారు. ఈ వాహనం బ్రష్ లెస్ డిసి మోటార్ సాయంతో పనిచేస్తుందని వివరించారు. ఈ వాహన ప్రత్యేకత ద్వంద చార్జింగ్ వ్యవస్థ కలిగి ఉండటమేనని, సౌర శక్తితో ఛార్జ్ అయ్యేలా సోలార్ ప్యానల్ల ద్వారానూ, సాధారణ ప్లగ్ ఇన్ చార్జింగ్ ద్వారా రీఛార్జ్ చేయగలదని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఈ ఆవిష్కరణ స్థిరమైన శక్తి వనరుల వైపు ఒక గొప్ప అడుగు వేయడమేనని అన్నారు. యువత సాంకేతికతను సమాజ హితానికి వినియోగించడం ఎంతో ప్రాముఖ్యమైనదని, ఇంధన ఉత్పత్తిలో పునరుత్పాదక శక్తి వినియోగం పెరిగేలా ఇలాంటి పరిశోధనలు చేయాలని సూచించారు. ఈ వాహనం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించడమే కాక వాయు కాలుష్యాన్ని నియంత్రించడం సాధ్యమవుతుందని అన్నారు. సౌర శక్తి వల్ల తక్కువ వ్యయంతో ప్రయాణం చేయవచ్చునని అన్నారు. పరిశ్రమలలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ఇది ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాన్ని అన్నమాచార్య విశ్వవిద్యాలయ విసి డాక్టర్ ఇ.సాయి బాబారెడ్డి, ప్రో ఛాన్సలర్ సి.అభిషేక్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లిఖార్జునరావు, ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి నారాయణ, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మ లలిత విద్యార్థులను అభినందించారు.

ద్విచక్ర వాహనాన్ని ఆవిష్కరిస్తున్న చొప్పా గంగిరెడ్డి

## ఠాగూర్ సినిమాను తలపించేలా..

**ప్రయివేట్ వైద్యుల నిర్వాకం**
**చనిపోయిన బిడ్డకు వైద్యం అందించినట్టు నటిస్తూ దోపిడీ**
**కేసు నమోదు చేసిన పోలీసులు**

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

తెలుగులో సినీ హీరో చిరంజీవి నటించిన ఠాగూర్ సినిమా తరహా వైద్యం మదనపల్లెలో వెలుగు చూసింది. డబ్బు కోసం ఓ ప్రయివేట్ ఆస్పత్రి ఆడిన భాగోతం బట్ట బయలైంది. బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం, వేంపల్లి దళితవాడకు చెందిన వెంకటేష్, స్వాతి దంపతులకు రెండేళ్ల క్రితం వివాహమైంది. జనవరి 30 తేదీన స్వాతి స్థానిక పిహెచ్‌సిలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ బరువు తక్కువగా ఉండడంతో ఇంక్యు బెటర్‌లో పెట్టాలని వైద్యులు సూచించడంతో పట్టణంలోని అమ్మినేని వీధిలో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రిని సందర్శించారు. పరీక్షించిన వైద్యులు ఇంక్యు బెటర్‌లో బిడ్డను పెట్టారు. వారం రోజులుగా బిడ్డకు వైద్యం ఇస్తున్నట్లు నటిస్తూ రూ.40 వేలకు పైగా దోపిడీ చేశారు. బుధ వారం రాత్రి బిడ్డ పరిస్థితి విషమంగా ఉందని బయటకు తీసుకెళ్లాలని సూచించారు. ఆగ్రహించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుటే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ బిడ్డ ఎప్పుడో చంపేసి, వైద్యం పేరుతో తమను దోపిడీ చేశారని ఆరోపించారు. డబ్బు మీద పెట్టిన శ్రద్ధ బిడ్డ ప్రాణాలు కాపాడడంలో పెట్టలేదని వాపోయారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేసి తమ బిడ్డను చంపేశారని ఆరోపించారు. అనంతరం మదనపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ చేరుకొని హాస్పిటల్ పైన, వైద్యుడు, వైద్య సిబ్బంది పైన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎరిషావల్లి తెలిపారు.

మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

## 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిప్యూటీ డిఇఒ

**ప్రజాశక్తి-రాయచోటి**

మార్చి నెలలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని డిప్యూ టీ డిఇఒ శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సంబేపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జడ్‌పి హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిం చారు. సిలబస్ పూర్తయిందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి పునాది వంటిదన్నారు. లక్ష్య సాధన కోసం పట్టుదల, అంకితభావంతో బాగా చదవాలని సూచించారు. పరీక్షలలో చూచి రాతలు ఉండవని, అత్యంత పకడ్బందీగా పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగ్రహణాత్మక పరీక్షలలో వచ్చిన మార్కులు ఆధారంగా పదవ తరగతి విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజిం చాలన్నారు. డి గ్రూపు లోని విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక అనుస రించాలని చెప్పారు. సబ్జెక్టు వారీగా ముఖ్యమైన మూడు మాదిరి ప్రశ్నాపత్రాలను రూపొం దించాని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సిఇఆర్‌టి రూపొందిం చిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులుగా గౌతమ్‌కుమార్

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

బహుజన్ సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా మదనపల్లెకు చెందిన బందెల గౌతమ్‌కుమార్ నియమితులయ్యారు. మదనపల్లె నుంచి 40 ఏళ్ల వయ స్సులో జాతీయపార్టీకి రాష్ట్ర అధ్యక్షులుగా ఎంపిక కావడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ 17 ఏళ్ల వయస్సులో విద్యార్థి సంఘ నాయకుడిగా పోరాట ప్రస్థానాన్ని ప్రారంభించి, తర్వాత భారతీయ అంబేద్కర్ సేన(బాస్) వ్యవస్థాపక అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్, అనుచరుడిగా పనిచేస్తూ, ఆ సంస్థలో ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షు డిగా పనిచేశానన్నారు. 2014లో అంబేద్కర్ యువసేనను స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షులుగా ప్రజా, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేశామన్నారు. 2017 సెప్టెంబర్ 17న మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్, కాన్షీరామ్, బెహన్ మాయావతి భావజాలంతో పనిచేస్తూ, బహుజన్ సమాజ్‌పార్టీ సిద్ధాంతాలకు, ఆశయాలకు ఆకర్షితుడై కార్యకర్తగా చేరారు. 2019 జూన్‌లో బిఎస్‌పి రాష్ట్ర కోశాధికారిగా, సెప్టెంబర్ 17 తర్వాత రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేశానన్నారు. తన పోరాటపటిమ, పార్టీకి విధేయత, అంకితభావాన్ని గమనించి బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులుగా నియమించిందని అన్నారు. తన శక్తి, సామర్థ్యాలపై నమ్మ కంతో మాయావతి, బిఎస్‌పి జాతీయ కన్వీనర్ ఆకాష్ ఆనంద్, రాజ్యసభ సభ్యులు, బిఎస్‌పి జాతీయ కో-ఆర్డినేటర్ రాంజీ గౌతమ్ తనకు అత్యంత కీలకమైన అధ్యక్ష బాధ్యతలు అప్పగిం చారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయనన్నారు.

# రైతుల అభ్యున్నతికే గోకులం షెడ్లు : 'చమర్తి'

**ప్రజాశక్తి-ఒంటిమిట్ట**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. గురువారం మండలంలోని చిన్న కొత్తపల్లె గ్రామంలో గోకులం షెడ్లను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పాడి పరిశ్ర మను ప్రోత్సహించేలా టిడిపి ప్రభుత్వం చేపట్టిన గోకులం షెడ్లు పశువుల సంరక్షణకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. 2018లోనే టిడిపి ప్రభుత్వం గ్రామాలలో పాడే రైతుల శ్రేయస్సును గుర్తించి గోకులం షెడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గోకులం షెడ్ల నిర్మాణాల పట్ల నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరించి పశుపోషకుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమ ర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గోకులం షెడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందని చెప్పారు. గ్రామాలలో పశుపోషణ, గొర్రెలు,మేకల పెంపకానికి పాడి పరిశ్రమకు ఎంతగానో దోహదపడేలా మెరుగైన వసతితో మినీ గోకులం పేరిట షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొమర వెంకట నరసయ్య, మాజీ ఎంపిటిసి ఓబినేని సుబ్బమ్మ, ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ నాయుడు, మాజీ జడ్‌పిటిసి చలమయ్య యాదవ్, న్యాయవాదులు న్యాయవాది ఆదినారాయణ రావు, రామదాసు, నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య, మామిళ్ల శ్రీహరి, దత్తాత్రేయులు, శివకుమార్, సర్పంచ్ ప్రతాప్ నాయుడు, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ కొండయ్య, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీను పాల్గొన్నారు.

గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మీకి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

## గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-పుల్లంపేట**

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులను ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపా నందరెడ్డి సతీమణి వరలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని శ్రీరంగరాజుపాలెం ఎస్టి కాలనీలో రూ.16 లక్షల్య వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లకు వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని పేదలకు ఇల్లు, వీధి దీపాలు, నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గం లోని ప్రతి మారుమూల గ్రామానికి కూడా సిమెంటు రోడ్డును వేయించడం జరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే మాటల్లో చెప్పడం కాదని చేసి చూపించడమే అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో ప్రతి గ్రామంలోనూ నీరు పుష్కలంగా ఉండాలని నీటి కొరత ఉన్న గ్రామాల ప్రజలు తమను సంప్రదిస్తే వెంటనే పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మీని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 25న మండల స్థాయి టాలెంట్ టెస్ట్

**ప్రజాశక్తి-పుల్లంపేట**

ఈ నెల 25న ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు పుల్లంపేట మండలం స్థాయిలో టాలెంట్ టెస్టను స్థానిక ఎస్‌బివిడి సభ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, వి. సిద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు బాగా సన్నద్ధమవుడానికి ప్రోత్సహించే విధంగా ఈ ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, ,తృతీయ బహుమతిగా రూ.3వేలు నగదు విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యా యులు తమ పాఠశాల విద్యార్థులు పాల్గొనేట్టుగా ప్రోత్సహించాలని కోరారు. పూర్తి వివరములకు 6303701314 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## 15 వరకు సబ్సిడీ రుణాల గడువు పొడిగింపు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

సబ్సిడీ రుణాల గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ వరకు పొడిగించిందని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం అందిస్తున్న బిసి, ఇబిసి, ఇడబ్ల్యూఎస్, కాపు సహా ఇతర కార్పొరేషన్ల రుణాల గడువును ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు మరో మారు పొడిగించిందన్నారు. మొదట ఈనెల7 వరకు ఉన్న గడువును 12వ తేదీ వరకు పెంచగా మరో మారు 15వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని తెలిపారు. లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అర్హులందరికీ కార్పొరేషన్ల రుణాలను అందించడానికి అవకాశం కల్పిస్తున్నాదని పేర్కొన్నారు. కార్పొరేషన్ల కింద అందిస్తున్న రుణాలు లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీతో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వయస్సు 21 నుంచి60 ఏళ్ల మధ్య ఉండి, తెల్ల రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు బుక్, ఫోటో తో అర్హులైన వారు ఈనెల 15వ తేదీ లోపు ఎపిఒబిఎంఎంఎస్ వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్

## క్యాంపస్ డ్రైవ్‌లో 28 మందికి ఉద్యోగాలు

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

విద్యార్థుల భవిష్యత్తును సమృద్ధిగా తీర్చిదిద్దే లక్ష్యంతో శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఫస్ట్ సోర్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. సుమారు 80 మంది విద్యార్థులు హాజరయ్యారని వారిలో 25 మంది విద్యార్థులు తమ ప్రతిభతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని అన్నారు. సుదీర్ఘ ప్రయాణంలో విజయం సాధించాలంటే ఆత్మవిశ్వాసం, కష్టపడే మనస్తత్వం అవసరమని అన్నారు. ఎంపికైన విద్యార్థులు మన కళాశాల ప్రతిభను చాటారని భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి. శ్రీనివాసులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆడపాల శివకుమార్, కంపెనీ అధికారులు అరుళ్, అనిల్‌కుమార్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్లేస్మెంట్ అధికారి పి.వెంకట ప్రసాద్ పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

## రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నవాజ్

**ప్రజాశక్తి-రాయచోటి టౌన్**

ముస్లిం ఐక్యవేదిక కార్మిక విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణానికి చెందిన నవాజ్ క్రిష్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ సంస్థ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్ అలీ చేతుల మీదుగా నవాజ్ క్రిష్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ముస్లిం కార్మికుల కోసం పని చేస్తున్న సంస్థలో తన వంతు కృషి చేస్తూ సలహాలు, సహకారాలు అందిస్తూ ఇచ్చిన భాధ్యత ను విజయవంతంగా నిర్వహిస్తానని, ముస్లిము కార్మిక అభ్యున్నతకు తోడ్పడుతానని తెలిపారు.

## వెంకన్నకు వైభవంగా స్నపన తిరుమంజనం

**- పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి**

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండలంలోని కోసవారి పల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయలో ఆరు రోజులుగా టిటిడి ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. టిటిడి ఆగమ అడ్వైజర్ శ్రీనివాస చార్యులు ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణ ప్రసాద్ బట్టర్,రమేష్ బాబు, కృష్ణమూర్తి, ధనుష్ సాంప్రదాయబద్ధంగా నియమ నిష్ఠలతో ఉదయం స్నపన తిరుమం జనం నిర్వహించి, సాయంత్రం పుష్పయాగ కార్యక్రమం నిర్వహించారు. ఈ పుష్ప యాగా కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని తిలకించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ దిశంత్ కుమార్, ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో ప్రయివేట్ వాహనాలకు అడ్డుకట్ట

**ప్రజాశక్తి-గాలివీడు:** స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణం ఉదయం నుంచి రాత్రి వరకు పవేట్ వాహనాలకు స్టాండ్‌లా మారింది. గురువారం ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్సు నిలిచేందుకు కూడా స్థలం లేకుండా ద్విచక్ర వాహనాలతో బస్టాండ్ నిండిపోవడంతో పోలీసులు స్పందించారు. స్థానిక ఎస్ఐ పి. శ్రీరాములు స్పందించి పోలీసు సిబ్బంది బస్టాండ్ దగ్గర పంపి వాహనదారుల కౌన్సెలింగ్ ఇచ్చి ద్విచక్రవాహనాలు తొలగించారు. బస్టాండ్ ఆవరణం ప్రశాంతంగా కనబడటం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

# రైతులకు నష్టాలను మిగిల్చిన కర్బూజ

- మండల వ్యాప్తంగా 20 ఎకరాల్లో సాగు
- పంట దిగుబడి శూన్యం
- లబోదిబో మంటున్న రైతన్నలు
- చేల్లోనే కాయలను వదిలేసిన వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

**ప్రజాశక్తి-గాలివీడు**

మంచి లాభాలు గడించవచ్చు ఆశతో కర్బూజను సాగుచేసిన రైతులకు నిరాశే మిగిలింది. చలి ఎక్కువ కావడంతో పంటకు వైరస్ సోకింది. తక్షణ చర్యలు కరువవడంతో కొన్ని చోట్ల పంటంతా దెబ్బతింది. పెట్టుబడికి చేసిన అప్పులకు వడ్డీ కూడా కట్టలేని దుస్థితి ఏర్పడిందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వేసవి మొదలయ్యే సమయానికి పంట చేతికొస్తుంది. కాయలు అమ్ముడు పోయి మంచి దిగుబడి వస్తుందనే ఆశించారు. లాభాలు అటుంచితే పంటకు వైరస్ సోకి కాయలు పొలంలోనే కుళ్లి పోయాయి. పంట కోతకు రాక మునుపే నెత్తిపై పిడుగు పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నకిలీ విత్తనాలు, తెగుళ్లతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు. గాలివీడు మండలంలోని 17 గ్రామాలలో 20 ఎకరాలలో రైతులు కర్బూజా సాగు చేశారు. గోపనపల్లికి చెందిన రైతు ఆవుల వెంకటరమణారెడ్డి అరవీడు వద్ద 8 ఎకరాలు కర్బూజ సాగు చేశాడు. రూ.6 లక్షలు వరకు ఖర్చు చేసి కిరణ్ కర్బూజా అనే విత్తనాలు ఉపయోగించడం ద్వారా పంట పూర్తిగా దెబ్బతింది. కర్బూజ పంటలోనైనా డబ్బు సంపాదించుకోవచ్చని ఆరు లక్షల ఖర్చు పెడితే పైసా కూడా చేతికి చిల్లి గవ్వకూడా రాలేదని, పంటనంతా చేల్లోనే వదిలేశానని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు అరవీడు వేమారెడ్డి మాట్లాడుతూ అరవీడు ఉయ్యాల వారిపల్లిలో మూడు ఎకరాలు కర్బూజ పంట సాగు చేశారు. పైసా కూడా చూడందే కర్బూజా పంట ఎత్తిపోయిందని పేర్కొ న్నారు. అదే గ్రామానికి

పొలంలోనే వదిలేసిన కర్బూజ కాయలు

చెందిన రైతు చిన్న కోట్ల వెంకటరమణ నాలుగు ఎకరాలు కర్బూజా పంట సాగు చేసి రూ.3లక్షల వరకు ఖర్చు చేసినా ఫలితం లేదని, కాయలు కుళ్లి పోవడంతో చెల్లోనే వదిలేసే ఎర్పడిందని అన్నారు. మండల వ్యవసాయ అధికారి గౌతమి మాట్లాడుతూ అరవీడు గోరాన్ చెరువు గ్రామాలలో 20 ఎకరాల దాకా కర్బూజ పంట సాగు చేశారని పంట రైతు చేతికి అందేలోపలే పంట దిగుబడి తగ్గిపోవడంతో పంట దిగుబడితగ్గి పోవడం జరిగిందని రైతులకు నష్టం వాటిల్లి నట్లు పేర్కొన్నారు.

### అప్పుల ఊబిలో కూరుకుపోయాం

నాలుగు ఎకరాలు కర్బూజా పంట సాగు చేశాను. మంచి దిగుబడి సాధించాలనే ఆశతో ఆరు లక్షల రూపాయల ఖర్చు పెట్టాను. కాయదిగుబడి రాక పంట దెబ్బతినడంతో కర్బూజాను తోటనే వదిలేశారు. ఉద్యాన పంటలైన టమోటా, వంగతో తీవ్రంగా నష్టపోయామని కర్బూజ పంటతోనైనా ఉపశమనం పొందాలనుకుంటే మరింత అప్పుల ఊబిలోకి కూరుకపోయాం. మూడు పంటలతో దాదాపు రూ.19 లక్షల వరకు నష్టం వాటిల్లింది. పెట్టిన పెట్టుబడి ఖర్చు కూడా రాలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**- కసిరెడ్డి వెంకటశివారెడ్డి. రైతు, గోరాన్‌చెరువు**

# ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

**- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్**

వినతులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించారు. సబ్ కలెక్టర్ రావడంతో అర్జీదారులు పోటెత్తారు. బి.కొత్తకోటలో ఆక్రమణలు చేసిన కబ్జాదారులపై స్థానిక ప్రజలు పెద్దఎత్తున ఫిర్యాదులు చేశారు. పట్టణ పరిధిలోని మున్సిపల్ ఆస్తులు, రెవెన్యూ ఆస్తులు ఆక్రమణలపై ఫిర్యాదు చేయడంతో సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి అనధికారికంగా కట్టడాలు నిర్మించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించమని, కట్టడాలను తొలగిస్తామని పేర్కొన్నారు. అడ్డొచ్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్, పోలీస్ శాఖను ఆదేశించారు. కబ్జాదారులపై ఉక్కు పాదం మోపాలన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమించినట్లు ప్రజల దృష్టికి వస్తే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు.

# కరువు మండలాల్లో 150 రోజులు పనిదినాలు : పీడీ

**ప్రజాశక్తి-రామాపురం**

కరువు మండలాల్లో కూలీలకు150 రోజులు పని దినాలు కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామం పెద్ద చెరువులో చేపట్టిన ఉపాధి హామీ పనులను గురు వారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్లూరు గ్రామంలో 225 మంది కూలీలు పనిచేస్తున్నారని మండల వ్యాప్తంగా 2200 పైగా కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో58 వేల మంది కూలీలు పనిచేస్తున్నారన్నారని, జిల్లా వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 38 వేల ఎకరాలు పండ్ల తోటల పెంపకం చేపట్టినట్లు వివరించారు. ఎవరైన అర్హులైన రైతులు ఉంటే పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లోని కూలీలు వలసలు వెళ్లకుండా ఉండేందుకు ఉపాధి పనులు కావాల్సిన కూలీలకు

ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

పనులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ పెంచలయ్య, ఇసి శివయ్య, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## నీటి సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

నీటి సంరక్షణ ప్రభుత్వ చేయమని డ్వామా పీడీ టి.వెంకటరత్నం పేర్కొన్నారు. కొనంపేట పంచా యతీలోని వాటర్‌షెడ్ యాత్రలో భాగంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పంట పొలాల్లో పారంపండ్లు, చెక్ డ్యాములు, అదేవిధంగా సబ్సిడీలో పైపులు, స్ప్రేయింగ్ మిషన్లు, ఇంజన్లు రైతులకు అవసరమైన పరికరాలు అందిస్తుందని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పొదుపు చేసే కార్యక్రమం ప్రతి ఒక్కరూ చేపట్టాలని, భూగర్భ జలాలు పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.లక్కిరెడ్డిపల్లి మండల నాయకుడు మాట్లాడుతూ నీటి సంరక్షణ ప్రభుత్వ ధ్యేయం అని నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకొని నీటిని ఒడిసి పట్టుకోవాలని తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఎల్లప్పుడు రైతులకు వాటర్‌షెడ్ పథకం కింద అడిగిన ప్రతి ఒక్క రైతుకు ఫారంపాండ్, చెక్ డ్యామ్‌లు ,పథకాలు, పరికారాలు సకాలంలో అందజేయాలని అధికా రులకు ఆదేశించారని యనుమల మదన్ మోహన్ తెలిపారు కార్యక్రమంలో ఎపిఒ లక్ష్మీ నరసింహ, ఎంపిడిఒ రెడ్డ య్య, పిఒ వెంకట్రామిరెడ్డి, ఎంఇఒ-చక్రనాయక్ దపేపల్లె,పాలెం,వాటర్ షెడ్ చైర్మన్లు కోణంపేట సర్పంచ్ లక్ష్మీనా రాయణ, రైతులు, ప్రజలు పాల్గొన్నారు

## బినామీ పేర్లతో మస్టర్లు నమోదు చేస్తే కఠిన చర్యలు

**లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని దొర్రిచెరువు సమీపంలో ఉపాధి కూలీలు చేస్తున్న స్ట్రాగ్రెడ్ కందకాలను అన్నమయ్య జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరత్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు నాణ్యతగా చేయాలని, పనిచేసే కూలీలను మాత్రమే మస్టర్లు నమోదు చేసి ఎన్ ఎన్ఎంఎస్‌లో యాప్‌లో ఫోటోలు నమోదు చేయాలని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. బినామీ పేర్లు మాస్టర్ల నమోదు చేసి ఫోటోలు అప్‌లోడ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రైతులకు యూనిక్ ఐడి తప్పనిసరి

**ప్రజాశక్తి-కలికిరి :** భూమి కలిగిన ప్రతి రైతు 11 నెంబర్లతో కూడిన యూనిక్ కోడ్ పొందుటకు రైతు సేవ కేంద్రం పరిధిలో రైతు సేవ కేంద్ర సిబ్బంది ద్వారా పొందాలని మండల వ్యవసాయ అధికారిని మమతారెడ్డి తెలిపారు. మండల పరిధిలో మొత్తం రైతులు 8587 మంది భూమి కలిగిన రైతులు ఉన్నారని ఇందులో ప్రస్తుతం 900 మంది రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ పొంది ఉన్నారని అన్నారు. ప్రతి రైత ఈ నెలాఖరు లోపల యూనిక్ గుర్తింపు కార్డును పొందవలసినదిగా కోరారు. ఈ గుర్తింపు కార్డు పొందని యెడల సదరు రైతులు పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి పొందుటకు అర్హులు కారని అన్నారు. రైతులు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్ , పట్టాదారు పాసుబుక్, జిరాక్స్ ఆధార్ లింకు అయిన ఫోన్ నెంబర్ తీసుకెళ్ళాలని తెలిపారు.

## డ్రైవర్లు బాధ్యతగా వాహనాలు నడపాలి

**ప్రజాశక్తి-ములకలచెరువు**

వాహనాలు డ్రైవర్లు బాధ్యతగా వాహనాలు నడిపి ప్రమాదాలు బారిన పడకుండా ఉండాలని మొలక లచెరువు ఎస్ఐ నరసింహుడు సూచించారు. మొలకలచెరువు టమోటా మార్కెట్లో డ్రైవర్లకి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలలో ప్రయాణించే వారు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డ్స్ ఉంచుకోవాలన్నారు. కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్, తప్పకుండా పెట్టుకోవాలని, ఆటో డ్రైవర్లు ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు. సౌండ్ బాక్సులు పెట్టుకొని వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి వాహనం నడిపిన, మైనర్లు వాహనాలు నడిపిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరసింహుడు తెలిపారు. **కలికిరి:** వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి సూచించారు. కదిరి పోలీస్ స్టేషన్‌లో వాహనం చోధకులకు హెల్మెట్ వాడకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల బారినట్లు తప్పించుకోవడానికి హెల్మెట్ ఎంతో ఉపయోగపడు తుందని, ప్రతి ఒక్కరు చెప్పిన వాహన దారులు హెల్మెట్ వాడాలని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు.

## పడమర ఎంపిపి పాఠశాలలో ఎంఇఒ తనిఖీ

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

చాలాకాలంగా నిరుపయోగంగా ఉన్న పట్టణంలోని ప్రాథమిక పాఠశాల (పడమర) భవనాన్ని గురువారం ఎంఇఒ రెడ్డిశేఖర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఎవరికి ఉపయోగం లేకుండా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏదైనా నిర్మాణం చేపట్టి ప్రజలకు ఉపయోగకరంగా ఉంచాలని అన్నారు. ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే కబ్జాలు చేస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక చొరవ చేసుకుని నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనాన్ని వినియోగం తేవాలని స్థానిక ప్రజలు కోరారు ప్రజా అవసరాల కోసం స్థానిక పిటిఎం రోడ్డులో అంగన్వాడీ కేంద్రానికి పక్కా భవనం లేనందున ఈ స్థలంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల ఉన్న చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంఇఒకు తెలిపారు

## అడవికి నిప్పు

**-1250 ఎకరాల్లో అగ్నికి ఆహుతి**

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి :** మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండకు గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో భారీగా సుమారు 1250 ఎకరాల్లో అడవి ఇప్పటివరకు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు మల్లయ్య కొండ దక్షిణం వైపున చింతల పూల కోనలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్ని మంటలు చెలరేగాయి. ఒడ్డురోల గుట్ట, జంగముల, మిరప చెట్లదిన్నె, అటవీ ప్రాంతమంతా అగ్నికి ఆహుతి అయ్యింది. అడవికి సమీపంలోని పొలాలలో వేరుశెనగ, మామిడి మొక్కలు అగ్ని వేడికి నష్టం వాటిల్లింది. కొందరు రైతులు రానివ్వకుండా ఆరిపారు. అడవిలో శేషాచలం కొండల్లోని ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, పలు రకాల జంతువులు, పక్షులు, అగ్నిమంటలకు ఆహుతి అయ్యాయి. ఇంత జరుగుతున్న అటవీశాఖ అధికారులోలో స్పందన లేదని ప్రజల నుండి ఆరోపణలు వినబడుతున్నాయి. ఉదయం అటవీ శాఖ రేంజర్, అటవీ సిబ్బంది, మల్లయ్య కొండను సందర్శించారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి మిగిలిన అడవి నైనా కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ప్రజల కోరుతున్నారు.

సరోజినీ నాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

## ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రోజినీ నాయుడు జయంతి వేడుకలను జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహిళలు అబల కాదు సబల అని దానికి ఒక మంచి ఉదాహరణ సరోజినీ నాయుడు అని ఆమె స్వతంత్ర సమరయోధురాలే గాక కవయిత్రిగా చిన్న వయసులోనే అనేక రచనలు చేసిందని అన్నారు. భారత గాన కోకిలగా పేరుపొందారని ఉత్తర ప్రదేశ్ మొదటి మహిళా గవర్నర్‌గా పనిచేసి మహిళ లోకానికే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.

## టెలికాం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్‌గా కరీముల్లా

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

టెలికాం అడ్వైజరీ కమిటీ డైరెక్టరుగా నియమితులైన మాజీ అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, ఆయన సతీమణి 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షబానాలు గురువారం మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి తన నియామకం పట్ల ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్ కుమార్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీముల్లాకు ఏ పదవి అప్పగించిన సమర్థవంతంగా నిర్వహిస్తారని, గతంలో వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఎంతో అంకితభావంతో పనిచేశారని కితాబిచ్చారు. అనంతరం కరీముల్లా మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ టెలికం వినియోగదారుల సమస్యల పరిష్కారానికి బాధ్యతగా సేవలు అందిస్తానని తెలియజేశారు. అదేవిధంగా అధిష్టానం ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తు పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి సేవలు అందిస్తామని స్పష్టం చేశారు.

# క్రైం కార్నర్

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**ప్రజాశక్తి-కలికిరి**

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మండలంలోని ఈతపల్లి ఈతమాను వడ్డేపల్లి కలకడ పీలేరు హైవేలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..సంబేపల్లి మండలం, బోయపల్లి రౌతు కుంట గ్రామానికి చెందిన కే.శే. వెంకటరమణ భార్య ఇంజేటి బుజ్జమ్మ కువైట్‌కు జీవనోపాధికి వెళ్ళి బుధవారం రాత్రి సుమారు 12.45 గంటలకు విమానం దిగడంతో ఆమెను పిలుచుకొనిరావడానికి ఆమె బంధువు అయిన చిన్నమండెం మండలం, కొండమోలు గ్రామానికి చెందిన రామలక్ష్మణ్ తన స్నేహితుడైన చిన్నమండెంకు చెందిన ఆఫ్ఘాన్ రఫీక్‌ఖాన్ టొయోటా ఇతియోస్ కారులో బుధవారం బయలుదేరి, చెన్నై విమానాశ్రయంకు చేరుకున్నారు. అక్కడ కువైట్ నుంచి వచ్చిన బుజ్జమ్మను కారు ఎక్కించుకొని, తిరుగు ప్రయాణంలో ఆఫ్ఘాన్ రఫీక్‌ఖాన్ కారు తోలుతుండగా, వెనుక సీట్‌లో రామ లక్ష్మణ్, బుజ్జమ్మ కూర్చొని ఉన్నారు. మార్గమధ్యలో వారు గురువారం ఉదయం 6.30 గంటలకు పీలేరు-రాయచోటి రోడ్డులో మండలంలోని ఈతమానువడ్డీపల్లి దగ్గరకు వచ్చేసరికి కారును ఆఫ్ఘాన్ రఫీక్ ఖాన్ అతివేగంగా, అజాగ్రత్తగా పీలేరు వైపు నుంచి రాయచోటి వైపుకు తోలి, వేగాన్ని అదుపుచేయలేక రోడ్డుకు ఎడమ వైపు ఉన్న కల్వర్ట్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. ఈఘటనలో ముగ్గురికి గాయాలు కాగా గాయాలపాలైన బాధితులను స్థానికులు 108 అంబులెన్స్‌లో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తరువాత ఆఫ్ఘాన్ రఫీక్ ఖాన్, బుజ్జమ్మను బంధువులు, తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో డ్రైవర్ మృతి చెందగా అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుజ్జమ్మ కుడా మృతి చెందింది. రామ లక్ష్మణ్ ఫిర్యాదుపై, కలికిరి సిఐ కె.రెడ్డిశేఖర్ ఆదేశాల మేరకు, హెడ్ కానిస్టేబుల్ పి.మనోహర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భార్య తాళి తెంచేసిందని భర్త ఆత్మహత్యాయత్నం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

కాపురానికి రమ్మంటే తాళి తెంచి ముఖాన కొట్టడమే కాకుండా తల్లిదండ్రులతో కొట్టించిందని భర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. పుంగనూరు చెందిన కొండప్ప(22), చిత్తూరు మేలుపట్లకు చెందిన మారక్కను వివాహం చేసుకున్నాడు. కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడిన మారక్క అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. వారం రోజులు గడుస్తున్నా రాకపోవడంతో కాపురానికి పిలుచుకువచ్చేందుకు కొండప్ప భార్య పుట్టినిల్లు మేలుపట్లకు వెళ్లాడు. అక్కడ భార్య కాపురానికి రానని ఎదురు తిరిగి, తాళి తెంచి ముఖాన విసిరేసి, తల్లిదండ్రులతో కొట్టించింది. అవమాన భారంతో ఇళ్లు చేరిన కొండప్ప తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పుంగనూరు పోలీసులు విచారిస్తున్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-నందలూరు**

కడప-చెన్నై జాతీయ రహదారిలోని మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద గురువారం తెల్లవారుజామున బైక్‌పై వెళుతున్న ఒంటిమిట్ట రాచపల్లి గ్రామానికి చెందిన నందిమండలం సునీల్, నందిమండలం రమేష్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. రాజంపేట పట్టణంలో వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వారిని వెంటనే 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కేబుల్ వైర్ల చోరీపై పోలీసులు ముందడుగు

**- రైతు ఫిర్యాదుతో కేసు నమోదు**

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

వరుసగా జరుగుతున్న కేబుల్ వైర్ల చోరీలపై స్థానిక పోలీసులు ముందడుగు వేశారు. గండి మాలపల్లెకు చెందిన రైతు కందూరి నాగరాజ ఫిర్యాదుపై ఎఎస్ఐ ఎస్.ఎ.జిల్లానిబాషా కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్మనపల్లి పంచాయతీ గండి మాలపల్లెకు చెందిన కందూరి నాగరాజుకు వెంగంవారిపల్లి గ్రామంలో కొంత వ్యవసాయ భూమి ఉండగా, అందులో అతను రెండు బోర్లను వేసుకొని, మోటార్లను అమర్చారని అన్నారు. మంగళవారం ఆయన ఉదయం నుంచి సాయంత్రం గంటల వరకు వరకు పొలం పనులు చేసుకుని తిరిగి ఇంటికి వచ్చారన్నారు. మరుసటి రోజు ఉదయం పొలం వద్దకు వెళ్లి పంటకు నీరు పెట్టడానికి మోటారు ఆన్ చేయగా అది పనిచేయకపోవడంతో బోరు వద్దకు వెళ్లి గమనించగా కేబుల్ వైర్ ను చోరీ చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. బోరు స్టార్టర్ నుంచి బోరు మోటర్ వరకు సుమారు 200 మీటర్లు గల కేబుల్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించకెళ్లారని తెలిపారు. అనంతరం బాధిత రైతు చుట్టుపక్కల గ్రామాలలోని రైతులను విచారించగా మరికొన్ని ప్రాంతాలలోను గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్ వైర్లను కత్తిరించ కెళ్ళారని తెలిపారు. బాధిత రైతు కందూరి నాగరాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కేబుల్‌వైర్లను దుండగులు దోచుకెళుతుండటంతో పొలాలకు నీరందకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన చెందారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి న్యాయం చేయాలని కోరారు.